# పరాయి సిరా

అనువాద కథలు

స్వేచ్ఛానువాదం–మల్లాది వెంకట కృష్ణమూర్తి



## చిన్నమాట

*కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం  పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.*

*కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం  కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.*

*తెలుగులో ఆ950-ఆ960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.*

*విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.*

*చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.*

*అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...*

*మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.*

## *నేను నిన్న మరణించాను*

**- రాబర్ట్ ఏ ఆర్థర్**

**అతని పేరు గ్రెగరీ.** ఇప్పుడు అతను మధ్య వయస్కుడు. అతను జీవితాంతం ఒకే అంశం మీద పరిశోధన చేసాడు. అది మరణం గురించిన విచారణ. లక్షల సంవత్సరాలనించి మనిషి మరణ రహస్యాన్ని తెలుసుకోవాలని వాంఛిస్తున్నాడు. కాని ఎవరూ కనుక్కోలేకపోయారు.

చిన్నప్పటి నించే గ్రెగరీకి మరణించాక ఏమౌతారు? అనే విషయం మీద ఆసక్తి ఏర్పడింది. జీవితం, మరణం మధ్యగల అంతుపట్టని ఆ అంశాన్ని తెలుసుకోవాలని గ్రెగరీ తపన పడసాగాడు.

యోగి కృష్ణని కలిసేదాకా అతనికి సరైన దారి దొరకలేదు. తనకి కావాల్సిన గురువు దొరికాడని నమ్మాక కొన్ని నెలలు ఆయన దగ్గరే గడిపాడు. అతనికి తన విచారణ ఓ కొలిక్కి వస్తూండగా ఓ రోజు యోగి కృష్ణ చెప్పాడు.

"నువ్వా పరిశోధనని ఇక ఆపేయాలి."

"ఎందుకని?" గ్రెగరీ ఆశ్చర్యంగా అడిగాడు.

"మన దగ్గర అందుకు సరిపడే డబ్బులేదు. మనం శాస్త్రీయ పరికరాలని కొనాలి" ఆయన వివరించాడు.

"ఎంతవుతుంది?" గ్రెగరీ అడిగాడు.

"చాలా. అందుకు బహుశ లక్ష డాలర్లు అవసరమవచ్చు."

"లక్షలంటే చాలా ఎక్కువ. ఎలాగో సంపాదిద్దాం."

"ఎవరిస్తారు?" యోగి కృష్ణ అడిగాడు.

"నా అన్న జాన్ సంపన్నుడు. అతన్ని అడిగి చూస్తాను."

మర్నాడు గ్రెగరీ హాలీవుడ్‌లోని బీచ్ నించి కనిపించే ఓ కొండశిఖరం మీది తన అన్న ఇంటికి వెళ్ళాడు. తోటమాలి ఛార్లీ అతని అన్న వ్యాహ్యాళికి సముద్రపు ఒడ్డుకి వెళ్ళాడని చెప్పాడు. వెంటనే గ్రెగరీ వెళ్ళి తన అన్నని కలిసి తను వచ్చిన పని చెప్పాడు.

"అలాంటి పిచ్చి పరిశోధనలకి నీకు డబ్బివ్వను" జాన్ సిగార్ తాగుతూ చెప్పాడు.

"కాని రేమండ్ ఫౌండేషన్ అధిపతిగా నువ్వు మానవాళి బాగుకోసం చాలావాటికి లక్షలు విరాళంగా ఇస్తున్నావుగా?" గ్రెగరీ ఆశ్చర్యంగా ప్రశ్నించాడు.

"కాని ఇది ప్రపంచాన్ని బాగు చేయదు."

"మేము చాలాకాలంగా మనిషి మరణ రహస్యాన్ని ఛేదించాలని అనుకుంటున్నాం. మేమా పరిశోధనలో దాదాపు ఆఖరి దశకి చేరుకున్నాం. ఇది నిజం. మాకు కావాల్సిందల్లా డబ్బు, కొంత సమయం. ఇందులో మేము విజయం సాధిస్తే అది మానవాళికి ఎలాంటి మేలు చేస్తుందో ఆలోచించు" గ్రెగరీ అర్థించాడు.

"ఎలా?"

"మరణం కలిగించే ఆందోళనలన్నీ తొలిగిపోతాయి. మరణానంతరం మనం ఏమవుతామో తెలుస్తుంది."

"కాని అది అసాధ్యం. నన్నడిగితే మీ యోగి కృష్ణ మోసగాడు. నీలాంటి మూర్ఖుల నించి డబ్బుని సంపాదించే దొంగ" జాన్ నవ్వుతూ చెప్పాడు.

"అది నిజం కాదు" గ్రెగరీ రోషంగా చెప్పాడు.

"నిజం. ఇదో మోసపూరిత పథకం."

"అంతేనా?"

"అంతే" జాన్ స్థిరంగా చెప్పాడు.

"నా పరిశోధన మధ్యలో ఆగకూడదు. నాన్న విల్లు ప్రకారం నువ్వు మరణించాక నేను రేమండ్ ఫౌండేషన్‌కి అధికారిని అవుతాను" చెప్పి గ్రెగరీ జాన్‌ని కొండమీదనించి కిందకి తోసేసాడు.

జాన్ కొడుకు రాబర్ట్, కూతురు సూ కి తమ తండ్రి మరణవార్త తెలిసింది.

"మీ నాన్న కళ్ళు తిరిగి శిఖరం మీంచి కిందపడిపోయాడు. అదెంత వేగంగా జరిగిందంటే నేను అతన్ని పట్టుకుని ఆపలేకపోయాను" గ్రెగరీ చెప్పాడు.

"కాని నాన్నకి ఎన్నడూ కళ్ళు తిరగడం జరగలేదు" సూ బాధగా చెప్పింది.

"ఒంట్లో ఏదోగా ఉందిరా అని రెండు, మూడు అడుగులు వెనక్కి వేసి కిందకి పడిపోయాడు."

"నువ్వు, నాన్న శిఖరం మీద వాదించుకోవడం చూసానని మన తోటమాలి ఛార్లీ చెప్తున్నాడు. ఏమంటావు?" సూ అడిగింది.

"వాదించుకున్నామా? అది నాన్సెన్స్. జాన్‌కి నా ప్రాజెక్ట్ గురించి వివరించాను" గ్రెగరీ చెప్పాడు.

"ఛార్లీ ఆయన కళ్ళు తిరిగి పడ్డాడని నమ్మడంలేదు. నువ్వు తోసావని చెప్తున్నాడు" రాబర్ట్ చెప్పాడు.

"నాన్సెన్స్. పడే మీ నాన్నని నేను పట్టుకునే ప్రయత్నం చూసి అలా అనుకుని ఉంటాడు" గ్రెగరీ చెప్పాడు.

"కాని అది నేను నమ్మను. ఎందుకంటే నువ్వు రేమండ్ ఫౌండేషన్‌కి అధిపతి అయ్యావు" రాబర్ట్ చెప్పాడు.

"రాబర్ట్. బాబాయ్‌ని అనుమానించకు" సూ వెంటనే చెప్పింది.

"పోస్ట్‌మార్టం చేసిన డాక్టర్ మీ నాన్న ప్రమాదవశాత్తు మరణించాడని చెప్తున్నాడు. కాబట్టి ఈ టాపిక్ మీద చర్చ ఇంతటితో పూర్తైంది" గ్రెగరీ చెప్పాడు.

"నావరకు పూర్తికాలేదు. నేను లాయర్ దగ్గరకి వెళ్తాను. నువ్వా ఫౌండేషన్‌కి సరైన మనిషివి కావని చెప్తాను" రాబర్ట్ వెంటనే చెప్పాడు.

"నేను ఇప్పటికే ఆ ఫౌండేషన్ అధిపతిని అయ్యాను. ఇకనించి దాన్ని ఎలా నడపాలో అది నా ఇష్టం. దాని ఫండ్స్‌ని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ డెత్‌కి బదిలీ చేస్తాను" గ్రెగరీ చెప్పాడు.

"కాని బాబాయ్ ఆ ఫండ్స్ కేన్సర్, టి.బిలాంటి వ్యాధుల మీద పరిశోధన శాస్త్రజ్ఞులకి వెళ్ళాలి" సూ చెప్పింది.

"ఇప్పుడు నాకు పూర్తి నమ్మకం ఏర్పడింది. బాబాయే నాన్నని ఆ ఫౌండేషన్ ఫండ్స్ కోసం చంపాడని" రాబర్ట్ అరిచాడు.

"మీ ఇద్దరూ తక్షణం బయటకి నడవండి" రాబర్ట్ గ్రెగరీ కోపంగా అరుస్తూ రాబర్ట్‌ని తోయబోతూంటే, అతను గ్రెగరీని తోసాడు.

తక్షణం గ్రెగరీ తూలి కిందపడ్డాడు. ఇనప ఫైర్‌ప్లేస్‌కి గ్రెగరీ తల తాకి రక్తం కారసాగింది. తను ఎక్కడికో చాలా దూరానికి వెళ్తున్న భావన గ్రెగరీకి కలిగింది. వారి మాటలని అతను విన్నాడు.

"రాబర్ట్. బాబాయ్‌కి ఊపిరి ఆడటంలేదు" సూ భయంగా చెప్పింది.

"అవును. పోయాడు" రాబర్ట్ స్పర్శ తగిలాక అతని మాటలు వినిపించాయి.

ఆ తర్వాత గ్రెగరీకి ఏదీ వినపడలేదు.

మర్నాడు ఫ్యూనరల్లో ప్రీస్ట్ చెప్పాడు.

"గ్రెగరీ చివరిదాకా మరణరహస్యాన్ని ఛేదించాలనే పరిశోధనతోనే గడిపాడు."

ఆ చీకటిలో ఎంతసేపు ఉండిపోయాడో గ్రెగరీకి తెలీదు. మెళుకువ వచ్చాక అతనికి తనమీద చల్లిన గులాబీల వాసన వేసింది. కళ్ళు తెరచి చూసి, తను కొవ్వొత్తులు వెలిగే ఓ చర్చ్‌లో మరో మూడు శవపేటికల పక్కన ఓ శవపేటికలో పడుకుని ఉన్నాడని గుర్తించాడు. లేచి కిటికీలోంచి బయటకి చూసాడు. తర్వాత శవపేటికలోకి చూసి అందులోని దేహం తనదిగా గుర్తించాడు.

పక్కనే ఉన్న శవపేటికల్లోంచి ఓ ఆడ, ఓ మగ బయటకి వచ్చారు.

"ఎవరు మీరు?" గ్రెగరీ అడిగాడు.

"మా దేహాలు ఆ శవపేటికల్లో ఉన్నాయి."

గ్రెగరీకి వారి మాటలు బోధపడలేదు. ఆ ఇద్దరినీ పోలిన వారి దేహాలు శవపేటికల్లో కనిపించాయి.

"అంటే మనం చచ్చిపోయామా?" గ్రెగరీ అడిగాడు.

"అవును. నిన్నరాత్రి మీరు జారిపడి, తలకి దెబ్బ తగిలి మరణించారు" ఆమె చెప్పింది.

"నాకు గుర్తొచ్చింది. మనం ఎక్కడున్నాం?" గ్రెగరీ అడిగాడు.

"ఛాపెల్లో. మన శవపేటికలని సిమెట్రీకి తీసుకెళ్ళి పాతిపెట్టడానికి కాసేపట్లో మనుషులు వస్తారు" అతను చెప్పాడు.

"నన్ను పాతిపెడతారా?" గ్రెగరీ భయంగా అడిగాడు.

"భయపడకండి. మీరు వదిలేసిన, ఖాళీ చేసిన దేహాన్ని వారు పాతిపెట్టేది" ఆమె చెప్పింది.

"అవును. నేను రెండు రాత్రుల క్రితం కారు ప్రమాదంలో మరణించాను. రేపటిదాకా నన్ను పాతిపెట్టరు. నా పేరు బ్రౌన్.

"ఈమె నా భార్య మిసెస్ బ్రౌన్" అతను మళ్ళీ చెప్పాడు.

"కాని ఇదిలా ఉంటుంది అనుకోలేదు. నేనింకా చూడగలుగుతున్నాను. వినగలుగుతున్నాను. ఊపిరి పీల్చగలుగుతున్నాను. గుండె కూడా కొట్టుకుంటోంది" గ్రెగరీ తన ఛాతీ మీద చేతిని ఉంచుకుని చెప్పాడు.

"ఇంతకాలం వాటికి అలవాటుపడటం వల్ల అలా అనిపిస్తోందంతే. కొద్దిసేపట్లో మిస్టర్ బెనడిక్ట్ వచ్చి మిమ్మల్ని తీసుకెళ్తాడు." ఆమె చెప్పింది.

"మిస్టర్ బెనడిక్ట్ ఎవరు?" గ్రెగరీ అడిగాడు.

"మన మార్గదర్శి. నిన్నరాత్రి మాకు కనపడి, బాధపడద్దని, తర్వాతి ప్రపంచంలోకి తీసుకెళ్ళడానికి మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళాడు" అతను చెప్పాడు.

ఇద్దరు వ్యక్తులు తలుపు తెరచుకుని ఓ తోపుడు బండితో వచ్చారు వారి వెనకే సూ, రాబర్ట్ కూడా వచ్చారు. వారు తన దేహం వున్న శవపేటికని ఆ బండిలోకి ఎక్కించాక గ్రెగరీలో అకస్మాత్తుగా భయం కలిగింది. గట్టిగా అరిచాడు.

"రాబర్ట్! సూసాన్! మీరు నన్ను పాతిపెట్టకండి. నేనింకా చావలేదు."

"మీరిలా ఆలోచించకూడదు వృథాప్రయాస. అది ఆ లోకంలోని వాళ్ళకి వినపడదు" అతను కూడా చెప్పాడు.

తన దేహాన్ని ఉన్న స్ట్రెచర్‌తో వాళ్ళు బయటకి వెళ్ళి తలుపు మూసేసారు. గ్రెగరీ మళ్ళీ బ్రౌన్ దంపతులతో మిగిలాడు.

"నా జీవితకాలం నేను మరణించినవారితో కమ్యూనికేషన్‌కి ఎంతో పరిశోధన చేసాను. కాని ఇప్పుడు మరణించాక నేను ప్రపంచంతో మాట్లాడలేకపోతున్నాను. యోగి కృష్ణకి ఇది చెప్పాలి. ఎలాగైనా ఆయనతో నేను మాట్లాడాలి" అతను బాధగా చెప్పాడు.

"ప్రశాంతంగా ఉండండి. అందుకు అవకాశం ఉంటే మిస్టర్ బెన్‌డిక్ట్ మీకు తప్పక ఆ దారి చెప్తారు" మిసెస్ బ్రౌన్ సానుభూతిగా చూస్తూ చెప్పింది.

గ్రెగరీ కుర్చీలో కూర్చున్నాడు. గతరాత్రి తను మరణించాడని నమ్మకం కలిగింది. బెనడిక్ట్ కోసం ఎదురుచూడసాగాడు. చాలాసేపటి తర్వాత అతని చెవుల్లో ఏదో సంగీతం వినిపించింది. పొడుగైన నల్లటి రోబ్‌లో ఓ వ్యక్తి ప్రత్యక్షమయ్యాడు. అంత పొడవు వ్యక్తిని గ్రెగరీ ఎన్నడూ చూడలేదు.

"మీరిద్దరూ సిద్ధమా మిస్టర్ అండ్ మిసెస్ బ్రౌన్?" ఆ దంపతుల వంక చూస్తూ అడిగాడు.

"సిద్ధమే" మిసెస్ బ్రౌన్ కంఠం మాత్రం దుఃఖంగా ఉంది.

"పదండి" ఆయన కోరాడు.

"కాని నేను ఇప్పుడే రాలేను. నేను భూమి మీద మాట్లాడాల్సిన వారున్నారు. నేను నిజం తెలుసుకున్నాను" గ్రెగరీ చెప్పాడు.

"కాని మీరు మీతో రావడంలేదు" బెనడిక్ట్ చెప్పాడు.

"ఎందుకని?"

"అది మీకు విధించే శిక్ష. కనపడకుండా, వినపడకుండా మనుషుల మధ్య తిరుగుతూండాలి" బెనడిక్ట్ కఠినంగా చెప్పాడు.

"ఎందుకని?" మిసెస్ బ్రౌన్ అడిగింది.

"అతనికి తెలుసు."

"ఆగండి. నన్ను కూడా మీతో తీసుకెళ్ళండి" గ్రెగరీ బాధగా కోరాడు.

వాళ్ళు ఒకటి, రెండు అడుగులు వేసాక మాయమైపోయారు. అతను బయటకి పరిగెత్తాడు. సెమెట్రీలో దూరంగా వెళ్తున్నవారివైపు పరిగెత్తాడు కాని దారిలో కనపడని గ్లాస్ లేదా తెరలాంటిదేదో అతన్ని అడ్డుకుంది. అతను గొంతుచించుకున్నా వినపడనట్లుగా వెళ్ళిపోయారు. దాంతో అతను అరవడం ఆపేసాడు. సూ, రాబర్ట్ అతనికి ఐదడుగుల దూరంలో కొత్తగా కట్టిన ఓ సమాధి ముందుకి వచ్చి నిలబడ్డారు. కాని గ్రెగరీని చూడలేకపోయారు. అతను వారి మాటల్ని వినగలిగాడు.

"నాన్నా! అంకుల్ గ్రెగరీ వెళ్ళిపోయాడు" రాబర్ట్ చెప్పాడు.

"అవును. బాబాయ్ ఎక్కడున్నా కాని ఇప్పుడు ప్రపంచానికి తనకి మృత్యువు గురించి తెలిసిన రహస్యాన్ని చెప్పే ప్రయత్నం చేస్తూంటాడా రాబర్ట్?" సూ అడిగింది.

"ఏమో? ఆయన ఈ విషయం మీద అంత మొండిగా లేకపోతే జరిగి ఉండేదికాదు."

"రాబర్ట్, సూసాన్. వినండి" గ్రెగరీ అరిచాడు.

కాని అది వారికి వినపడనట్లుగా అతనివైపు తిరగలేదు. తను మరణించాడన్న సంగతి గ్రెగరీకి గుర్తొచ్చింది.

కొద్దిసేపటికి బెనడిక్ట్ మళ్ళీ ప్రత్యక్షమయ్యాడు.

"గ్రెగరీ మరణానంతరం ప్రపంచంలోని ఎవరితోనూ మాట్లాడలేవని ఇప్పుడు నీకు అర్థమైందా?" అడిగాడు.

"నో. యోగి కృష్ణ ఉందని చెప్పాడు."

"అతను మోసగాడు. నీనించి డబ్బు కాజేయాలని చూసాడు."

"నేనది నమ్మలేను."

"నువ్వీ విషయంలో అట్టే బాధ పడకూడదు. నాతోరా" చెప్పి బెనడిక్ట్ గ్రెగరీ చేతిని పట్టుకుని కారిడార్లోంచి చిన్న గదిలోకి తీసుకెళ్ళాడు. అక్కడో యువతి టైప్ చేస్తోంది. వీరి రాక గమనించనట్లుగా ఆమె తలెత్తి చూడలేదు.

"నీ శవాన్ని రేపు పాతడానికి అవసరమైన కాగితాల్ని ఆమె టైప్ చేస్తోంది. ఆమెతో మాట్లాడుతావా?"

"అవును వినమ్మాయ్. నేను గ్రెగరీని. నీ పక్కనే నించున్నాను."

ఆమె అతనివైపు చూడకపోవడంతో బెనడిక్ట్ నవ్వి చెప్పాడు.

"చూసావుగా. ఆమె నీ మాటలు వినలేదు"

"అమ్మాయ్. నువ్వు నాతో మాట్లాడక్కర్లేదు. నా కంఠం వినపడితే టైపింగ్ ఓసారి ఆపు" గట్టిగా కోరాడు.

ఆమె ఆపలేదు.

"చూసావుగా. ఇక పద. ఇంకో చోట ప్రయత్నిద్దాం."

బెనడిక్ అతన్ని ఇంకో గదిలోకి తీసుకెళ్ళాడు. ఆ గదిలో ఒకతను ఫోన్లో మాట్లాడుతున్నాడు.

"నేను ఛాపెల్ నించి ఫోన్ చేస్తున్నాను. రేపు సాయంత్రం నాలుగుకి గ్రెగరీని పాతిపెట్టడానికి అన్నీ సిద్ధం చేసాను. థాంక్ యూ"

"మిత్రమా నా మాటలు వినిపిస్తున్నాయా?" గ్రెగరీ గట్టిగా అడిగాడు.

అతను టెలిఫోన్ డైరెక్టరీని అందుకుని దాన్ని తిరగేయసాడు.

"మరణానంతరం ఏమవుతుందో ప్రపంచం తెలుసుకోవాలి" గ్రెగరీ గొణిగాడు.

ఇంకో చోటికి వెళ్ళారు. ఇద్దరు గొయ్యి తవ్వుతూ కనపడ్డారు.

"వాళ్ళు రేపటి నా సమాధి గోతిని తవ్వుతున్నారు కదా?"

"అవును" బెనడిక్ట్ జవాబు చెప్పాడు.

"ఇదిగో. నేను చెప్పేది వినపడితే మీరు కొద్దిసేపు తవ్వడం ఆపండి" గ్రెగరీ ఒకతని పక్కన నిలబడి అరిచాడు. వాళ్ళు ఆపలేదు.

"ఈ భూమి మీద శాశ్వతంగా ఉండే శిక్ష నీకు పడింది" బెనడిక్ట్ సానుభూతిగా చూస్తూ చెప్పాడు.

"నేను దాన్ని భరించలేను. బ్రౌన్‌దంపతులున్న చోటు ఎలా ఉన్నా సరే. నేను ఇక్కడ మాత్రం ఉండలేను."

"ఇది నీకు శిక్షని చెప్పాగా?"

"నేనేం పాపం చేసానని?" గ్రెగరీ నిరసనగా అడిగాడు.

"అది నీకు ప్రత్యేకంగా చెప్పాలా?" బెనడిక్ట్ నవ్వాడు.

"నేను నా అన్నని చంపినందుకా?" అడిగాడు.

"అది చెప్పాల్సింది నువ్వు."

"మా అన్నని నేను చంపడం పొరపాటే. నేను కోరిన డబ్బు ఇవ్వనందుకు కొండశిఖరం మీంచి కిందకి తోసేసాను. అందుకు ఇంత ఘోరమైన శిక్షా?" గ్రెగరీ ఏడుస్తూ చెప్పాడు.

"అంటే నీ తప్పుని ఒప్పుకుంటున్నావా గ్రెగరీ? ఐనా తీర్పు చెప్పడం నా పని కాదు."

"అవును. ఒప్పుకుంటున్నాను. నేను జాన్‌ని చంపాను. కాని చంపాలనే పథకం వేసి కాదు. అందుకు విచారిస్తున్నాను. దయచేసి నన్నిలా ఒంటరిగా వదిలి వెళ్ళకు" గ్రెగరీ అర్థించాడు.

"సరే. నీకు మనుషుల చట్టప్రకారం శిక్ష పడుతుంది" బెనడిక్ట్ చెప్పాడు.

"అంటే?"

"మీ ఇద్దరూ ఇక తవ్వడం ఆపండి. గ్రెగరీ తన అన్నని చంపానని చెప్పడం విన్నారా?" బెనడిక్ట్ వారిని అడిగాడు.

"విన్నాం" వారు చెప్పారు.

"వాళ్ళు విన్నారా? మరి పలకలేదే?" గ్రెగరీ అయోమయంగా అడిగాడు.

"కారణం  నా సూచన. మీ అన్న జాన్‌ని చంపినందుకు నిన్ను అరెస్టు చేస్తున్నాను" బెనడిక్ట్ చెప్పాడు.

"అరెస్ట్?" గ్రెగరీ నివ్వెరపోతూ అడిగాడు.

"అవును."

"అది అసాధ్యం"

"నేను హోమీసైడ్ (హత్యలు)కి చెందిన లెఫ్టినెంట్ బెనడిక్ట్‌ని. నువ్వు మరణించలేదు. పూర్తిగా బతికే ఉన్నావు"

"లేదు. నేను బతికిలేను."

"నీ నించి కన్ఫెషన్ కోసం చిన్న డ్రామాని ఆడాం. వీరంతా నటులు."

"మరి శవపేటికలోని నా దేహం?"

"వేక్స్ ఫిగర్. తననిక ఎవరూ ఏం చేయలేరు అనుకున్నప్పుడే ఎవరైనా నేరాన్ని ఒప్పుకుంటారని నాకు తెలుసు."

"లేదు. ఇది నేను నమ్మను. నమ్మలేను" గ్రెగరీ ఆవేదనగా చెప్పాడు.

"నీకు మరణం మీద ఒన్ ట్రాక్ మైండుంది. నీకు స్పృహ తప్పాక నువ్వు మరణించావని ఋజువు చేయాలనుకున్నాను. అది విజయవంతంగా చేసి నీ కన్ఫెషన్‌ని సంపాదించాను" బెనడిక్ట్ నవ్వుతూ చెప్పాడు.

"నో"

"దయచేసి గొడవ చేయకుండా నా వెంట రా."

"నో! నేన్ను నిన్న మరణించాను. నువ్వు నన్ను మోసం చేయలేవు. మరణించిన మనిషిని అరెస్ట్ చేయలేవు. నేను నిన్నరాత్రి మరణించాను" గ్రెగరీ తల అడ్డంగా ఊపుతూ చెప్పాడు.

అతను జీవించే ఉన్నాడని డాక్టర్లు చెప్పారు. కాని ఎవరూ కూడా అతను జీవించే ఉన్నాడని గ్రెగరీని నమ్మించలేకపోయారు. తను మరణించాడనే కోర్ట్‌లో చెప్పాడు.

మెంటల్ హాస్పిటల్స్‌లోని అందరికీ కూడా చెప్పాడు.

"పిచ్చాళ్ళల్లారా! నేను నిన్న మరణించాను."

**(వచ్చేనెల మరోకథ)**

Post your comments